7

సాక్షి తిరుపతి

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025


రథంపై ఊరేగుతున్న సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి (ఇన్‌సెట్) స్వామివారి ఉత్సవమూర్తులు

కోదండరాముడి తేరు..
భక్త జనహోరు

- వైభవంగా రథోత్సవం
- రాత్రి అశ్వంపై స్వామి విహారం

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారు రథంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారి రథాన్ని లాగారు. రథం యథాస్థానానికి చేరిన తర్వాత ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి, హారతి సమర్పించారు. మధ్యాహ్నం తిరుమంజనం, ఆస్థానం, సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారి అశ్వవాహన సేవ వేడుకగా సాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓలు గోవిందరాజన్, నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ఫుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం వైభవంగా జరుగనుంది.

న్యూస్‌రీల్

రుయాలో షార్ట్ సర్క్యూట్

- భయాందోళనకు గురైన రోగులు


రుయాలో కాలిపోయిన ఏసీ వైర్లు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో రోగులు భయాందోళనకు గురయ్యారు. అత్యవసర విభాగం సమీపంలోని ఎమర్జెన్సీ మెడికల్ కేర్ యూనిట్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీ ప్లగ్ పాయింట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఎయిర్ కండిషనర్ వైర్లు కాలిపోవడంతో పొగలు కమ్ముకున్నాయి. దీంతో రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏమి జరిగిందో తెలియక హడావుడి పడ్డారు. పక్కనే ఉన్న వైద్య సిబ్బంది సర్ది చెప్పి రోగులను సముదాయించారు. వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి, అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎలక్ట్రికల్ సిబ్బంది వచ్చి పరిశీలించి, ఏసీ వైర్లు కాలిపోయాయని గుర్తించారు. దీంతో అధికారులు, రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,721 మంది స్వామిని దర్శించుకున్నారు. 25,545 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

రియల్ ఎస్టేట్ ఆలయాల బాధ్యత టీటీడీదా ?

తిరుపతి కల్చరల్: తమ వ్యాపార అవసరాల కోసం రియల్ ఎస్టేట్ వెంచర్ల వద్ద ఆలయాలు నిర్మిస్తున్న పలువురు వాటి బాధ్యతను టీటీడీ తీసుకోవాలని భావించడం అన్యాయమని, ఈ వైఖరిని రాష్ట్రప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. బుధవారం అమరావతిలో జరిగిన టీటీడీ సమీక్షలో చెన్నై కేంద్రంగా పని చేస్తున్న జి.స్క్వేర్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ తాను వెంచర్లు వేసిన చోట టీటీడీ ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మిస్తోందన్నారు. ఆ ఆలయ నిర్వహణ బాధ్యతను టీటీడీ తీసుకోవాలని సీఎం ఆదేశించడం సరికాదన్నారు. ఈ ధోరణితో వ్యవహరిస్తే టీటీడీ వివాదాలకు కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కల్యాణ మండపాలు నిర్మించి వాటి నిర్వహణ చేయలేక, గతంలో కోడెల శివప్రసాద్ తన నియోజకవర్గంలో నిర్మించుకున్న కల్యాణ మండపాన్ని టీటీడీ నిర్వహించలేక కేవలం నెలకు రూపాయి లీజుతో ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిందన్నారు. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ సంస్థలు నిర్మించే ఆలయాలను కూడా టీటీడీ బాధ్యత తీసుకోవాలనుకోవడం సమంజసం కాదని, తక్షణం ఈ అంశంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య విధి..
వసూళ్లే పరమావధి



వారికి నిబంధనలు అడ్డురావు.. అక్రమాలను ఆపాల్సిన అధికారులు అభ్యంతరం చెప్పరు..ప్రశ్నించేవారు ఎదురుపడరు.. ఇంకేముంది.. ఏ పని చేయాలన్నా చేయి చాపుతారు. ముడుపులు ముట్టజెప్పందే.. ఏదీ జరగదు..వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ జాఢ్యం పెరిగిపోయింది. కూటమి గద్దెనెక్కిన తరువాత వసూళ్ల పర్వం మర్రిచెట్టు ఊడల్లా పాతుకుపోయింది. వైద్య ఆరోగ్య శాఖను అవినీతి కాలుష్యం ఆవహించింది. ఈ విష సంస్కృతి ఆ శాఖ సిబ్బందికి హానికరంగా మారింది.

వైద్య ఆరోగ్యశాఖలో వసూల్ రాజాలు!

- ప్రతి పనికీ మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే
- ఓ ప్రైవేటు ఆస్పత్రి రెన్యువల్‌కు 8 ఏసీలు పంపాలని హుకుం
- డిప్యుటేషన్ల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు
- పెండింగ్ బిల్లులు పాస్ కావాలంటే.. కార్యాలయానికి వస్తువులు
- పదోన్నతి పొందిన ఏఎన్‌ఎంల మూమెంట్ రికార్డు కోసం లంచం
- వెలవెలబోతున్న పీహెచ్‌సీలు.. రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సాక్షి తిరుపతి ప్రతినిధి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కొందరు కిందిస్థాయి అధికారుల పెత్తనం శృతిమించుతోంది. బదిలీ కావాలన్నా.. బిల్లులు పాస్ కావాలన్నా వారు అడిగింది సమర్పించుకుంటే పని పూర్తి అయినట్టే. ఆస్పత్రుల రెన్యువల్, డిప్యుటేషన్లు, పెండింగ్ బిల్లులు పాస్ చేయించడానికి, పదోన్నతి పొందిన వైద్య సిబ్బంది మూమెంట్ రిజిస్టర్ కోసం ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఫలితంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అవినీతికి అడ్డాగా మారిపోతోంది. జిల్లా కేంద్రమైన తిరుపతి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కొందరు యూడీసీలు, ఓ ఇద్దరు కిందస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరిలో యూడీసీలు డిప్యుటేషన్‌పై వచ్చిన వారు, యూనియన్లలో ఉన్న వారు కావడం గమనార్హం. జిల్లాలో 58 పీహెచ్‌సీలు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రుల వ్యవహారాల్లో తలదూరుస్తూ ఆరోగ్యశాఖను భ్రష్టుపట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల రెన్యువల్ కోసం మామూళ్ల వసూలు చేసుకుంటున్నారు. తిరుపతి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి యజమాని రెన్యువల్ కోసం వెళితే.. జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి 8 ఏసీలు పంపమని హుకుం జారీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. చేసేది లేక ఆరు ఏసీలు కొనుగోలు చేసి ఇచ్చినట్లు తెలిసింది. కొనుగోలు చేసిన బిల్లులను సైతం తమకే ఇవ్వాలని ఒత్తిడి చేసి తీసుకున్నట్లు జిల్లా కార్యాలయంలోని ఓ అధికారి వెల్లడించారు. ఏసీలను కొనుగోలు చేసినట్లు ప్రభుత్వానికి బిల్లులు పెట్టి అటు వైపు నుంచి కూడా డబ్బులు మంజూరు చేయించుకుని, జేబులు నింపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆస్పత్రులకు తనిఖీల పేరుతో వెళ్లి వసూళ్ల పర్వానికి తెర తీస్తున్నారు. అవినీతి అధికారుల అండతో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఘోరాలు జరుగుతున్నా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదే తరహాలో ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లపై పడి కాసులు గుంజుకుంటున్నారు.

మూమెంట్ రిజిస్టర్‌కూ మామూళ్లు ఇవ్వాల్సిందే

డిప్యుటేషన్లు వేయించుకున్న వారంతా జిల్లా కార్యాలయం లోనే తిష్ట వేసి కాలక్షేపం చేస్తున్నారు. కొందరు కార్యాలయానికి వచ్చి హాజరు వేయించుకుని వెళ్లిపోతుంటే.. మరి కొందరు జిల్లా కార్యాలయంలో కూర్చొని కునుకు తీస్తున్నారు. వీరు నచ్చిన వారికి, రూ.50 వేలు ఇచ్చిన వారిని నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్‌పై కోరిన ప్రాంతానికి పంపుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఉద్యోగోన్నతులు వచ్చిన ఏఎన్‌ఎంలకు అవసరమైన మూమెండ్ రిజిస్టర్ల కోసం ఆ వసూల్ రాజాలు వారి నుంచి మామూళ్లు పుచ్చుకుంటున్నట్లు ఏఎన్‌ఎం ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. చేయి తడిపితే కానీ ఇవ్వనని తెగేసి చెప్పినట్లు తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరికీ రేటు నిర్ణయించి వసూళ్లు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరుగుతున్న దందాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి అవినీతి అధికారులు, పనిపాట లేకుండా ఒకేచోట కూర్చొని ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా పైరవీలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కొందరు అధికారులు తమ ఇష్టా రాజ్యంగా పైరవీలు నడుపుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని డిప్యుటేషన్లు రద్దు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు జనవరిలో ఆదేశాలు జారీ చేశారు. అయినా 29 మందికి డిప్యుటేషన్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ విషయాన్ని 'సాక్షి' డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లింది. డిప్యుటేషన్లు రద్దు చేస్తామని వెల్లడించారు. ఆ తరువాత కూడా డిప్యుటేషన్ల సంఖ్యను 25కు కుదించారు. అనంతరం మరి కొందరిని వారి వారి స్థానాలకు పంపినట్లు చెబుతున్నారు. అయినా ఇప్పటికీ కొందరు అధికారులు జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలోనే తిష్ట వేసి ఉన్నారు. ఓ అధికారి గుట్టు చప్పుడు కాకుండా డిప్యుటేషన్ల వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు చొప్పున వైద్యులు ఉండాలనే నిబంధనలకు కూటమి ప్రభుత్వం నీళ్లొదిలింది. 17 పీహెచ్‌సీలో ఒక్కొక్కరు వంతున వైద్యులు ఉన్నారు. డిప్యుటేషన్ల పేరుతో కొందరు పీహెచ్ వైద్యులు గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడం మానేసి, సొంత క్లినిక్‌లో కూర్చొని డబ్బులు సంపాదించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందుకు శ్రీకాళహస్తిలో పనిచేసిన ఓ వైద్యురాలి నిర్వాకమే ఇందుకు నిదర్శనం. యూడీసీలు కొందరు వారు పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లకుండా సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. బి కొత్తకోటలో పనిచేస్తున్న ఓ ఏఎన్‌ఎం ఐపీ పెట్టింది. ఆ తరువాత సెలవులో ఉండి.. మూడు నెలల తరువాత కార్వేటినగరానికి బదిలీ చేసుకుంది. ఇందుకు ఆమె జిల్లా కార్యాలయంలోని ఓ అధికారికి ముడుపులు చెల్లించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నపాండూరులో హెల్త్ అసిస్టెంట్ పనిచేసిన వ్యక్తి ఆ పీహెచ్‌సీలో సిబ్బందితో దురుసుగా వ్యవహరిస్తుండడంతో జిల్లా ఆరోగ్యకేంద్రానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. అక్కడి నుంచి నెల్లూరుకు దగ్గరగా ఉన్న ప్రాంతానికి వెళ్లేందుకు పైరవీలు చేసుకుని అనధికారికంగా గూడూరుకు చేరుకున్నారు.

రైటింగ్ స్కిల్స్‌తో సమాచారం విశ్వవ్యాప్తం


వర్క్‌షాపు ప్రారంభిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: అకడమిక్ రైటింగ్ స్కిల్స్ పెంపొందించుకుంటేనే ఆలోచనలు, రచనలు వంటి సమాచారం ప్రపంచానికి చేరుతుందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ ఇంగ్లీషు విభాగం ఆధ్వర్యంలో 'విద్యార్థులకు, పండితులకు అకడమిక్ రైటింగ్– మెళకువలు' అనే అంశంపై రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు, పరిశోధకులు, పండితులు రైటింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి మెళకువలను అభ్యసనం చేయాలని సూచించారు. దిండిగల్ గాంధీగ్రామ్ రూరల్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జోసెఫ్ దొరైరాజ్ రిసోర్స్ పర్సన్ గా విచ్చేసి అకడమిక్ రైటింగ్ నైపుణ్యాలు, ఏకీకరణ, పొందిక, స్పష్టత అనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కన్వీనర్ ప్రొఫెసర్ శారద మాట్లాడుతూ విద్యార్థులకు అకడమిక్ రైటింగ్ స్కిల్స్ ఎంతో అవసరమని, ఎన్‌ఈపీ 2020తో దీని ఆవశ్యకత సంతరించుకుందని, ఈ క్రమంలో జాతీయ వర్క్‌షాపు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. డీన్ ప్రొఫెసర్ మురళి పాల్గొన్నారు.

6న జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని శ్రీదేవి కాంప్లెక్స్‌లోని టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ, బాక్సింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు రాష్ట్ర అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ పి.గీతా ఒక ప్రకటనలో తెలిపారు. క్యాబ్, కేడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 5వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ పోటీల్లో గెలిచిన బాలబాలికలు ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 95731 44232, 70135 91635 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రియల్ ఎస్టేట్‌కి శ్రీవారు
బ్రాండ్ అంబాసిడరా?

- దీనికి ఆగమశాస్త్ర సలహాలు తీసుకోవాలని చెప్పడం దారుణం
- కూటమి హయాంలో దిగజారిన టీటీడీ ప్రతిష్ట
- మీ పాలనకు నిరసనగా సాధువులు, స్వాములు ఆందోళన చేయలేదా?
- కొండపై విచ్చలవిడిగా మద్యం, మాంసం
- మంత్రి నారా లోకేష్ పీఏ రోజూ 10 -13 సిఫార్సు లెటర్లు జారీ
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సీఎం చంద్రబాబు రియల్ ఎస్టేట్ వెంచర్లకు శ్రీవేంకటేశ్వరస్వామిని బ్రాండ్ అంబాసిడర్‌గా మారుస్తున్నారని, ఇందుకు ఆగమశాస్త్ర సలహాలు తీసుకోవాలని చెప్పడం దారుణం అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ ప్రతిష్టను కూటమి ప్రభుత్వం రోజు రోజుకు దిగజార్చుతోందని మండిపడ్డారు. చెన్నైలో జీ స్క్వేర్ సంస్థ సొంత నిధులతో ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిందని సీఎం చంద్రబాబు చెప్పడం ఎంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ అభ్యంతరం చెప్పినా సీఎం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కలియుగదైవం వేంకటేశ్వరస్వామివారిని, టీటీడీని ప్రమోటర్‌గా చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థకు దేశ వ్యాప్తంగా వెంచర్లు ఉన్నాయని, సొంత నిధులతో ఇలానే దేవాలయాలు నిర్మాణం చేస్తామని ముందుకు వచ్చి, వాళ్ల వ్యాపారం పెంచుకుంటారన్నారు. సొంత ఖర్చులతో టీటీడీ ఆలయాలు కడితే తప్పు ఏమిటని సాక్షాత్తు సీఎం అనడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

టీటీడీ ప్రతిష్ట దిగజార్చుతున్నారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి టీటీడీ ప్రతిష్టను మరింతగా దిగజార్చుతున్నారని భూమన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సాక్షాత్తు ఆ పార్టీ నేతలు, భక్తులే అంటున్నారని చెప్పారు. లడ్డూ వివాదం మొదలుకొని నేటి వరకు అన్నీ అపచారాలే అన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ పాలనపై చేసిన ఆరోపణలకు సీబీఐ, సిట్ ఒక్క ఆధారం చూపించలేదన్నారు. కూటమి పాలనపై సాధువులు, స్వాములు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట, తిరుమలలో ఆందోళన చేయలేదా? అని నిలదీశారు. తిరుమలలో బాలాజీ నగర్, ఇతర ప్రాంతాల్లో మద్యం, మాంసం విచ్చలవిడిగా అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్యమతస్తుడు తిరుమల కొండకు వెళ్లిన విషయాన్ని ఈ సందర్భంగా వెల్లడించారు.

కాళ్లా వేళ్లా పడి విచారణ ఆపుకోలేదా?

వైకుంఠ ఏకాదశి తొక్కిసలాట ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించి హోమ్ శాఖ నుంచి విచారణకు జారీ చేసిన ఆదేశాలను కాళ్లా వేళ్లా పడి ఆపుకోలేదా?.. ఇది నిజం కాదా? అని భూమన నిలదీశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగ లేదన్నారు. దేశంలో ఉన్న మఠాధిపతులతో తాము సమావేశం నిర్వహించామని, ఇతర మతాలు నుంచి తిరిగి హిందువులుగా మారేందుకు ఒక వేదిక ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ పాలనలో నిర్ణయం తీసుకున్న విషయాన్ని భూమన గుర్తు చేశారు. హిందూమతంలో చేరేవారికి నేరుగా వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఇప్పించాలని నిర్ణయించామని, దీనిపైనా నాడు టీడీపీ రాజకీయం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. చిన్న పిల్లలు గోవిందా కోటి రాస్తే వారికి శ్రీవారి దర్శన అవకాశం కల్పించింది వైఎస్సార్‌సీపీ పాలనలోనేనని స్పష్టం చేశారు. శ్రీ వేంకటేశ్వర దివ్యానుగ్రహహోమం కార్యక్రమం తామే నిర్వహించామని, ఇప్పటికీ అత్యద్భుతంగా జరుగుతోందన్నారు. అయినా ఆ విషయాన్ని కూడా కూటమి పాలనలోనే జరుగుతున్నట్లు చెప్పుకోవడం దారుణమన్నారు. ఈ పది నెలలు పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన ఒక్క మంచి పనిలేదని ఆరోపించారు. వేంకటేశ్వర స్వామిని రాజకీయాలకు వాడుకోవాలని చూస్తే అపచారం అవుతుందన్నారు. చిత్తశుద్ధితో ఆలయ ప్రతిష్ట పెంచేందుకు పనిచేయాలని హితవుపలికారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నాణ్యమైన లడ్డూ

తిరుమల లడ్డూ నాణ్యత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పెరిగిందని భూమన కరుణాకరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలతో శ్రీవారి అన్న ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 3, 4 వేల లోపు వీఐపీ దర్శనాలుంటే కూటమి పాలనలో రోజుకు ఏడు వేలకు పెరిగాయన్నారు. మంత్రి నారా లోకేష్ పీఏ సాంబశివరావు రోజుకు 10 నుంచి 13 సిఫార్సు లెటర్లు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి నేతలు వీఐపీ సేవల్లో తరిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ పాలనలో భక్తులకు మేలు జరిగిందని చెప్పడానికి ఒక్కటైనా ఉందా? అని భూమన సవాల్ విసిరారు. కూటమి పాలనలో సీవీఎస్ఓ, జేఈఓ, స్విమ్స్ డైరెక్టర్‌ను కూడా నియమించలేకపోయారంటే.. మీ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతుందన్నారు. స్విమ్స్ హాస్పిటల్‌ను నిర్వీర్యం చేస్తోంది కూటమి ప్రభుత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ప్రక్షాళన అంతా డొల్ల అని మీ ఎల్లో పత్రికనే రాసిందని ఎద్దేవా చేశారు. సీఎం నిర్వహించిన సమీక్షలో చంద్రబాబు.. సమర్థుడు అయిన అధికారులను వెంటనే తీసి వేయమని చెప్పడం ఏమిటని భూమన ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని కాపాడతామని చెప్పిన డిప్యూటీ సీఎం ఎక్కడ? అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో తప్పు జరిగిందా..? ఈ పది నెలలు కాలంలో అపవిత్రం జరిగిందా? అనే అంశంపై తాము చర్చకు సిద్ధం అని భూమన సవాల్ విసిరారు.

జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జిగా రాజేష్

- డీడీ నాగరాజుకు ఉద్యోగోన్నతి


రాజేష్, ఇన్‌చార్జి జిల్లా మత్స్యశాఖ


నాగరాజు, జేడీ, కాకినాడ

తిరుపతి అర్బన్: మత్స్యశాఖ జిల్లా అధికారిగా పనిచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ నాగరాజుకు జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆ మేరకు ఆయన కాకినాడకు బదిలీ అయ్యారు. గూడూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా(ఏడీ) పనిచేస్తున్న రాజేష్‌కు జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు రాజేష్ తిరుపతి అలిపిరి రోడ్డులోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. మరోవైపు నాగరాజు తిరుపతి జిల్లా నుంచి రిలీవ్ అయి, కాకినాడకు వెళ్లారు. రెండేళ్లుగా జిల్లా మత్స్యశాఖ డీడీగా నాగరాజు విధులు నిర్వహించారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో రైతు మృతి

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం తొండమనాడు పొలాల్లో ఓ వృద్ధ రైతు చెట్టుకు వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రూరల్ సీఐ రవినాయక్ తెలిపారు. తొండమనాడు గ్రామానికి చెందిన చిన్నబత్తిరెడ్డి(62) పొలంలోని ఓ చెట్టుకు పలుపుతాడుతో వేలాడుతూ మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే తన పొలాన్ని కొందరు దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మనస్థాపానికి గురై చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు.

తిరుమల విద్యుత్ బస్సు సర్వీసులపై ఫిర్యాదులు

తిరుపతి అర్బన్: తిరుమల ఘాట్‌లో విద్యుత్ బస్సు సర్వీసులు అతివేగంగా నడుస్తున్నాయని, దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా ప్రజా రవాణా అధికారి నరసింహులు తెలిపారు. విద్యుత్ బస్సులపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం డీపీటీఓ కార్యాలయంలో విద్యుత్ బస్సుల ఇన్‌చార్జి జగదీష్‌ను పిలిపించి డీపీటీఓ నరసింహులు పలు సూచనలు చేశారు. విద్యుత్ బస్సు సర్వీసులతో మిగిలిన సర్వీసులకు లేదా సాధారణ వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఘాట్ రోడ్డులో నిత్యం వాహనాల రద్దీ ఉంటుందని, ఈ క్రమంలో వేగాన్ని తగ్గించాలని ఆదేశించారు. ఆ మేరకు డ్రైవర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. జగదీష్ మాట్లాడుతూ తిరుపతి–తిరుమల ఘాట్‌లో గంటకు 50 కిలోమీటర్లు, తిరుపతి–మదనపల్లెకు, తిరుపతి–రేణిగుంట ఎయిర్‌పోర్టుకు, తిరుపతి–కడపకు, తిరుపతి–నెల్లూరుకు గంటకు 80 కిలోమీటర్లు వేగంతో నడుస్తున్నాయని తెలిపారు. అనంతరం డీపీటీఓ మాట్లాడుతూ ఆర్టీసీ సాధారణ సర్వీసులు గ్యారేజీలో నుంచి బయటకు రావడానికి ముందే కండిషన్ తనిఖీలు చేయాలని మెకానిక్స్‌కు ఆదేశాలిచ్చామని చెప్పారు. కండిషన్ సక్రమంగా లేకుండా రోడ్డు పైకి రాకుడదని ఆదేశించారు. అలాగే తిరుపతి బస్టాండ్‌లో నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. అంతేతప్ప ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

● చిత్తూరు నగరానికి చెందిన ఓ ఇద్దరు మహిళలు తమిళనాడులోని అరుణాచలం వెళ్లి అర్ధరాత్రి సమయంలో వేలూరులో దిగారు. అక్కడి నుంచి చిత్తూరు రావడానికి బస్సు కోసం చాలా సేపు వేచి ఉన్నారు. తీరా చిత్తూరు–తిరుపతి వెళ్లే AP02 Z 5395 నంబరు బస్సు కండక్టరును ప్రాధేయపడ్డారు. ఎంత బతిమిలాడుకున్నా పట్టించుకోలేదు. సామాజిక మాధ్యమం వేదికగా అధికారులకు ఫిర్యాదు చేశారు.

● తమిళనాడులోని తిరువణ్నామలైకు చిత్తూరు మీదుగా తిరుపతి వెళ్లేందుకు ఇంద్ర బస్సులు ఉన్నాయి. ఇటీవల దైవ దర్శనార్థం వెళ్లిన ఓ ప్రయాణికుడు చిత్తూరు వచ్చేందుకు టిక్కెట్లు కొట్టే వ్యక్తిని ఆశ్రయించాడు. ఈ బస్సు చిత్తూరులో ఆగదంటూ ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు. కేవలం తిరుపతి టిక్కెట్లు మాత్రమే ఎక్కిస్తామని చెప్పాడు. లేకుంటే తిరుపతి టిక్కెట్ తీసుకుని చిత్తూరులో దిగొచ్చని చెప్పుకొచ్చాడు. ఆ టిక్కెట్లు ఇచ్చే వ్యక్తే అక్కడ రిజర్వేషన్ పాయింట్ ఒకటి పెట్టుకుని టిక్కెట్లు బుకింగ్ చేయడం విమర్శలకు తావిస్తోంది.

చిత్తూరు ప్రయాణికులంటే ఆర్టీసీ చిన్నచూపు చూస్తోంది. వేలూరులో చిత్తూరంటేనే బస్సు ఎక్కనివ్వడంలేదు. ఒక వేళ ఎక్కినా...సీటు లేదంటూ దింపేస్తున్నారు. చిత్తూరుకు రావాలంటే రాత్రిపూట ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంపై ఎందుకు ఇంత నిర్లక్ష్యం అంటూ మండి పడుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.

– చిత్తూరు రూరల్ (కాణిపాకం)


ఆర్టీసీ బస్సు

చిత్తూరా.. సీటు లేదు!

- బస్సు ఎక్కనివ్వని కండక్టర్లు
- చిత్తూరు ప్రయాణికులకు ఇబ్బందులు
- వేలూరులో ఆర్టీసీ బస్సుల్లో రోజూ గొడవలే
- రాత్రిపూట అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

ఆర్టీసీ చిత్తూరు మీదుగా వేలూరుకు 46 బస్సులు కేటాయించింది. ఇందులో చిత్తూరు–2 డిపో నుంచి 9 బస్సులుండగా 54 ట్రిప్పులు, అరుణాచలానికి 4 బస్సులుండగా 8 ట్రిప్పులు, తిరుమల నుంచి 33 బస్సులకు గాను 66 ట్రిప్పులు ఆర్టీసీ తిప్పుతోంది. ఈ ప్రయాణంలో చిత్తూరు నుంచి వేలూరు వెళ్లేటప్పుడు మాత్రం ఆర్టీసీ బస్టాండు నుంచి గుడిపాల వరకు కాట్పాడి... వేలూర్....వేలూర్ అంటూ పిలిచి ఎక్కించుకుంటున్నారు. తిరుమల సర్వీసుల్లో కూడా ఇలానే గౌరవంగా పిలిచి ఎక్కించుకుంటున్నారు. ఇలా నిత్యం వేలూరుకు వేల మంది వెళ్లి వస్తుంటారు. ప్రధానంగా సీఎంసీ, దుస్తుల కొనుగోలు, వ్యాపార లావాదేవీలు, వాహన, ఇతర సామగ్రి, ఎరువులు తదితర పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే తిరుగు ప్రయాణంలో చిత్తూరంటే ఆర్టీసీ కండక్టర్లు బస్సుల్లో ఎక్కించుకోకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోతున్నారు.

వేలూరు ఒక్కటే కాదు...

తమిళనాడులోని అరుణాచలం నుంచి చిత్తూరు చేరుకోవడానికి ప్రయాణికులు తంటాలు పడుతున్నారు. ఇంద్ర సర్వీసులాంటి ఏసీ బస్సులంటే సీట్లు లేవంటున్నారు. తిరుపతికి మాత్రమే సీటు ఉందని..ఈ–టిమ్ మిషన్‌లో చిత్తూరు టికెట్లకు ఆప్షన్ ఇవ్వలేదని కుంటి సాకులు చెబుతున్నారు. ఇక చిత్తూరు లోపలికి బస్సు వెళ్లదంటూ..వేరే బస్సు చూసుకోండి అంటూ చిత్తూరు ప్రయాణికులను బస్సులో అడుగు పెట్టనివ్వడం లేదు. అలాగే బెంగళూరు నుంచి తిరుపతి, విజయవాడ, నెల్లూరుకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా చిత్తూరు ప్రయాణికులను ఎక్కించడం లేదు. ఇలాంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నా ఆర్టీసీ అధికారులు తేలికగా తీసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరోనా కాలం తర్వాత చిత్తూరు ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించుకోవడం లేదని ఫిర్యాదు వస్తే అప్పటి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తక్షణం స్పందించారు. ఏ డిపో బస్సులైనా చిత్తూరు ప్రయాణికులను ఎక్కించాల్సిందేనని ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఆయన వైస్ చైర్మన్‌గా ఉన్నంత కాలం ఈ సమస్య రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది.



తిరుపతి డీపీటీఓతో మాట్లాడుతున్నాం..

వేలూరు నుంచి చిత్తూరుకు వచ్చే ప్రయాణికులను తిరుపతికి వెళ్లే బస్సుల్లో ఎక్కించడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై తిరుపతి డీపీటీఓతో మాట్లాడుతున్నాం. కచ్చితంగా సమస్యలు రాకుండా చూస్తాం. ఏ మార్గాల్లో ఇలాంటి సమస్యలు ఉన్నాయో చూసి కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– జగదీష్, డీపీటీఓ, చిత్తూరు

ఎస్వీ హైస్కూల్‌లో అత్యుత్తమ విద్య


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర హైస్కూల్‌లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నట్లు అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి విద్యార్థులు, అధ్యాపకులతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ చాలాకాలం తర్వాత ఇలాంటి కార్యక్రమానికి హాజరు కావడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీవారి పాదాల చెంత టీటీడీ పాఠశాలలో చదువుకుంటున్న మీరంతా ఎంతో అదృష్టవంతులన్నారు. అనంతరం వివిధ పోటీ పరీక్షలు, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, అకడమిక్ ఇన్‌చార్జ్ రంగలక్ష్మి, హెచ్‌ఎం సురేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం దుర్మార్గం

- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: కూటమి నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ దుర్మార్గంగా వ్యవహస్తున్నారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మండిపడ్డారు. నాయుడుపేట పట్టణంలోని సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు అండగా నిలిచి, కూటమి నాయకుల దౌర్జన్యాలు, అరాచాకాలు అడ్డుకోవడాన్ని తట్టుకోలేక కాకాణిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ నేతల దౌర్జనాన్ని ప్రశ్నిస్తే పోలీసులతో అణిచివేసే చర్యలు చేపట్టడడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు కావసున్నా, వారు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. సంక్షేమాన్ని గాలికి వదలి, కేవలం వైఎస్సార్ సీపీ నాయకులనే టార్గెట్ చేసుకుని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ పాలు ఇచ్చే గేదెను వదిలేసి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. జమిలి ఎన్నికలు వస్తే కూటమి నాయకులను ప్రజలు తరిమికొడతారన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టడమే పని పాలన సాగిస్తుందని, ఈ పద్ధతి మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయుడుపేట పట్టణ, మండల కన్వీనర్లు కలికి మాధవరెడ్డి, ఒట్టురు కిషోర్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, పార్టీ మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి కురుగొండ ధనలక్ష్మి, నియోజవర్గ కన్వీనర్ ఈదా రత్నశ్రీ , ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కట్టా కమలకర్‌రెడ్డి, చదలవాడ కుమార్, దారా రవి, పాలేటి నాగార్జున, మండల కన్వీనర్లు పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఆర్ముగం, పేట చంద్రారెడ్డి, షేక్ షబ్బీర్, వరకళా చంద్ర, రహమాతుల్లా, కింగ్స్‌వే జిలానీ, అశోక్ కుమార్, పేర్నాటి రాహుల్, అర్కాట్ శాంత కుమార్, మెస్ భాస్కర్‌రెడ్డి, అనపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారూ ఇదేనా మంచి పాలన?


తిరుపతి టౌన్ బ్యాంక్ ఎండీ శివకుమార్ చాంబర్‌లో ఆ బ్యాంక్ మాజీ చెర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేతల దౌర్జన్యం


మీడియాతో మాట్లాడుతున్న టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం రామారావు, ఎండీ శివకుమార్, సభ్యులు

- బ్యాంకులపై దౌర్జన్యం న్యాయమా?
- 12 ఏళ్లు టౌన్‌బ్యాంక్ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తికి బాధ్యత లేదా?
- కోర్టు ఆర్డర్‌ను ఎప్పుడూ గౌరవిస్తాం
- టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: సీఎం చంద్రబాబు గారు టీడీపీ నేతలు బ్యాంకు అధికారులపై దౌర్జన్యం చేయడం .. రౌడీయిజం చేయడమేనా? కూటమి అందిస్తున్న మంచిపాలన అని తిరుపతి టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం టౌన్‌బ్యాంక్‌లోని తమ చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2023లో రెండువేల నోట్లు రద్దు సందర్భంగా టౌన్‌బ్యాంక్‌లో అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తున్న కే.రోహిణికుమార్ బ్యాంక్ డిపాజిట్ దారులకు కొంత శాతం కమిషన్ పట్టుకుని, నోట్లు మార్పు చేసుకునే సౌలభ్యం టౌన్‌బ్యాంక్‌లో ఉందని పలువురికి మెసెజ్‌లు పెట్టారన్నారు. దీంతో ఆందోళనకు గురైన పలువురు ఖాతాదారులు తాము ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన రూ.2 కోట్లు వరకు గడువుకు ముందే తీసుకెళ్లారని చెప్పారు. ఈ విషయంపై విచారణ జరిపి, వాస్తవాలు తేలడంతో ఆ ఉద్యోగిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సర్వీసు నుంచి తొలగించామన్నారు. అయితే ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారని చెప్పారు. తనని విధుల్లోకి తీసుకోమని కోర్టు ఆర్డర్ ఇచ్చినట్లు గత నెల 26వ తేదీన ఆయన చెప్పారని పేర్కొన్నారు. అయితే 29న బ్యాంక్ బోర్డు మీటింగ్ ఉందని, ఆ తర్వాత తమ న్యాయవాదితో మాట్లాడి ఆర్డర్‌ను పరిశీలించి, ఉద్యోగంలోకి తీసుకుంటామని చెప్పామని వెల్లడించారు. అయితే ఆ ఉద్యోగి పలువురు టీడీపీ నేతలతో కలసి గురువారం బ్యాంక్‌లోకి చొరబడి ఎండీ శివకుమార్‌పై దౌర్జన్యం చేసి, బలవంతంగా రీ జాయినింగ్ రిపోర్ట్ తీసుకుపోవడం న్యాయమేనా? అని ప్రశ్నించారు. 12 ఏళ్ల పాటు టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా పనిచేసిన పులిగోరు మురళీకృష్ణరెడ్డి బాధ్యతగా వ్యవహరించకుండా ఇలా బ్యాంక్‌లో దౌర్జన్యం చేయడం ఏమిటని తప్పుపట్టారు. ఆయనతోపాటు తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత జేబీ శ్రీనివాస్‌తోపాటు పలువురు టీడీపీ నేతలు బ్యాంక్‌లోకి వచ్చారని చెప్పారు. కోర్టు అంటే తమకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. సమయం పడుతుందని చెప్పినప్పటికీ ఇలా దారుణంగా వ్యవహరించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో తాము టీటీడీ నుంచి రూ.10 కోట్లు టౌన్ బ్యాంక్‌లో డిపాజిట్లు చేయించామని చెప్పారు. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీ వారు చేసిన డిపాజిట్లను వెనుక్కి తీసుకువెళ్లేలా కృషి చేశారని ఆరోపించారు. బ్యాంక్ అభివృద్ధికి సహకరించాల్సిన కూటమి నేతలు ఇలా చేయడం ఏ మాత్రం న్యాయమో వారి విజ్ఞతకే వదిలిపెట్టేస్తున్నామన్నారు.


టౌన్ బ్యాంక్ వద్ద కూటమి నేతల కార్లు

ఎండీని రిక్వెస్ట్ చేశాం

అయితే బ్యాంక్ వివాదంపై టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి మాత్రం మీడియాతో మాట్లాడుతూ టౌన్ బ్యాంక్ ఎండీ శివకుమార్‌ను కలిసి, రోహిణి కుమార్‌కు జాయినింగ్ ఆర్డర్ ఇవ్వాలని రిక్వెస్ మాత్రమే చేశామని తెలిపారు.

నేడు తిరుపతి ఐఐటీ 10వ వ్యవస్థాపక దినోత్సవం


ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ(ఇన్‌సెట్) ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో శుక్రవారం 10వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఐఐటీని 2015లో తిరుపతి సమీపంలో తాత్కాలిక భవనంలో ప్రారంభించామన్నారు. మద్రాసు ఐఐటీ సహకారంతో తరగతులు ప్రారంభించినట్టు తెలిపారు. ఏర్పేడు సమీపంలోని 548 ఎకరాల్లో అధునాతన హంగులతో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మించుకున్నట్లు చెప్పారు. 35 ఎకరాల్లో సౌత్ క్యాంపస్‌లో క్లాస్ రూమ్స్, హాస్టల్, ల్యాబ్స్, స్పోర్ట్స్ క్లబ్‌లను నిర్మించి తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 2017లో ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 2018లో ఎంఎస్‌సీ ప్రవేశాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో 1,667 మంది విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 1.26 లక్షల మీటర్ల విస్తీర్ణంలో ఫేస్–ఏ క్యాంపస్ నిర్మాణాలు పూర్తి చేసినట్టు చెప్పారు. ఐఐటీ క్యాంపస్ శేషాచలం కొండకు దిగువన ఉన్న నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేందుకు 10 ఎకరాల విస్తీర్ణంలో రెండు నీటి సరస్సులు, 80 మిలియన్ లీటర్ల కెపాసిటీతో రెయిన్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. దీనికి జాతీయస్థాయి అవార్డును కూడా వచ్చిందన్నారు. 1 మెగా వాట్ రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎకో ఫ్రెండ్లీ పరిసరాలను రూపొందించడంలో భాగంగా, 1.10 లక్షల పూలమొక్కలు, 260 ఔషధ మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. వ్యవస్థాపక దినోత్సవంలో ఐఐటీ శాశ్వత ప్రాంగణ నిర్మాణ సంస్థ ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఎండీ చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ విశేష కృషి

ఏర్పేడు సమీపంలో 548 ఎకరాల్లో ఐఐటీ శాశ్వత ప్రాంగణం నిర్మాణంలో విభిన్న శైలి, అధునాతన వసతుల కల్పనలో డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ కృషి ఎంతో ఉంది. ఆయన అనునిత్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని ఎన్నో గొప్ప విజయాలు సొంతం చేసుకోవటంలో సఫలీకృతులయ్యారు.

దార్శనికుడు


కొందరు ఆశల కోసం బతుకుతారు.. మరి కొందరు ఆశయాల కోసం జీవిస్తారు.. ఈ రెండిటి సంగమంగా జీవనయాత్రలో నిత్యబాటసారిగా ఉన్నారాయన. పాఠాలు నేర్పడంతో తన విధులు ముగిశాయని భావించకుండా తాను పనిచేసే పాఠశాలలో చదివే బిడ్డల ఉన్నతికి అలుపెరగని కృషి చేస్తున్నారు. పేద పిల్లల కష్టాలు తెలుసుకుని పరిష్కారానికి పాటుపడుతున్నాడు. పిల్లలు బడికి రాకపోతే.. వారింటికి వెళ్లి స్కూలుకెందుకు రాలేదని మోముగా వారిని లాలించి, తన ద్విచక్రవాహనంలో వారిని పాఠశాలకు తీసుకొస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనే మోమిడి గిరిజనకాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇగింలాల బాలకృష్ణయ్య. – చిల్లకూరు

కలియుగదైవం.. వెంకన్న నడయాడిన నేల.. అన్నమయ్య కీర్తనలతో పులకించిన పుడమి.. విశేషాలకు నెలవైన ఆధ్యాత్మిక పురి.. ఎనిమిది వందల ఏళ్ల చరిత్ర కలిగిన తిరునగరి. ఈ నగరం జిల్లా కేంద్రం కావడంతో సముద్రతీరం.. అంతరిక్షపరిశోధన కేంద్రం ఇందులో చేరింది. ఫలితంగా రాయలసీమకు రా'జల'సీమగా కూడా వన్నె తెచ్చే భాగ్యం జిల్లాతో చేకూరింది.



ఆధ్యాత్మికపురి.. రాజలసీమ కీర్తి

నేటితో జిల్లాకు మూడేళ్లు

- 34 మండలాలు..ఏడు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు
- జిల్లాకు సముద్రతీరం
- 2022 ఏప్రిల్ 4న తిరుపతి జిల్లా ఏర్పాటు

జిల్లా సమాచారం

మండలాలు	34
పంచాయతీలు	774
రెవెన్యూ డివిజన్లు	4
నియోజకవర్గాలు	7
పార్లమెంట్ స్థానం	1
సముద్రతీరం	72 కిలోమీటర్లు

తిరుపతి అర్బన్: ప్రాచీన నేపథ్యం.. 800 ఏళ్ల చరిత్ర కలిగిన ఆధ్యాతికపురి తిరునగరి ప్రముఖ పుణ్యక్షేత్రంగా, విద్యాకేంద్రంగా విరాజిల్లింది. కాలక్రమంలో తిరుపతిగా రూపుదిద్దుకుంది. ఈ నగరం మూడేళ్ల కిందట జిల్లా కేంద్రంగా అవతరించింది. దీంతో పూర్వపు నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలు తిరుపతి జిల్లాలో కలవడంతో ఆధ్యాత్మిక నగరికి సముద్రతీరం , షార్ కూడా వచ్చి చేరింది. అన్ని హంగులతో దేశంలోనే ఓ ప్రత్యేక, విశిష్ట జిల్లా గా విరాజిల్లుతోంది.

పరిపాలన సౌలభ్యం కోసం

పరిపాలన సౌలభ్యం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4వ తేదీన జిల్లాల పునర్విభజనలో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పాటు అయ్యింది. టీటీడీకి చెందిన శ్రీపద్మావతి అతిథి గృహాన్ని కలెక్టరేట్ కార్యాలయానికి కేటాయించారు. గత సర్కార్ తీసుకున్న చక్కటి నిర్ణయంతో జిల్లా ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందని తమ మనస్సులో మాటను వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్‌లోనే కార్యాలయాలు



"కలెక్టరేట్‌కు వెళితే అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండడంతో ఇబ్బందులు లేకుండా అన్ని పనులు చూసుకురావడానికి సౌకర్యంగా ఉంది. గత సర్కార్ ముందుచూపులో చక్కటి ఆలోచన చేశారని భావిస్తున్నాం. గతంలో మూడు కార్యాలయాల్లో పనులు ఉంటే ఒక రోజు మొత్తం సరిపోయేది కాదు. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా ఉంది.

– జగదీష్‌రెడ్డి, సత్యవేడు

ఎంతో అనుకూలం



ఒకేచోట అన్ని కార్యాలయాలు ఉండడంతో అందరికీ ఎంతో అనుకూలంగా ఉంది. ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు పలు కార్యాలయాలకు వెళ్లడానికి నానా తిప్పలు పడేవారు. అయితే కలెక్టరేట్‌లోనే అన్ని కార్యాలయాలు ఉండడంతో ఎంతో అనుకూలంగా ఉందని భావిస్తున్నాం. దానికితోడు తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో పద్మావతి అతిథి గృహాన్ని ఎంపిక చేయడంతో విశాలమైన భవనం నేపథ్యంలో ఎంతో సౌకర్యంగా ఉంది.

– వెంకటేష్, రేణిగుంట